# మిద్దెమీద మిటాకారం

మొత్తానికి ఆ భవనమంతా ఓ అలజడి ప్రారంభమైంది. ఊరి చివరగావున్న ఆ మేడిగల్లో ఏదో వస్తువు పోనిరోజు లేదు. ఒకరోజు తెల్లవారి లేచేసరికి తలుపు తెరిచి వుంటుంది. ఒక బ్లాకులో గడియారం పోయింది, ఇంకో భాగంలో పెట్టెలు 'పరారు'...మరోరోజున మరొకటి. గస్తీ తిరిగేవారు తిరుగుతునే ఉన్నారు; పోయేవి పోతూనేవున్నై.

పైనా క్రిందా సుమారు ఓ ఇరవై భాగాగా ఉన్న ఆ భవంతిలో ఏదోజరిగినప్పుడల్లా పోలీస్ ఇన్‌స్పెక్టర్ హాజరీతప్పదు. వస్తుంటాడు, పోతూంటాడు.

ఆనాడు 'భూపే' కూడా వచ్చాడు. ఆయనకు డిటెక్టివ్ సరదాలు చాలావున్నై. పనీపాటా లేదు. పిత్రార్జితం కైంకర్యం చేసుకుంటూ, హాయిగా తిని తిరుగుతాడు. ఆటల్లోనూ, డిటెక్టివ్ గాను కాలం గడుపుతాడు. చువ్వలు వంచివున్న కిటికీదగ్గర భూతద్దంతో పరీక్షచేస్తూ, భూపే హఠాత్తుగా ఆగాడు. అందరూ ఆటుకేసి ఆత్రంగా చూశారు. ఏమీలేదు ఒక చిన్న వెంట్రుకముక్క! భూపే టేపుతీసి కొలిచాడు; ఠీవిగా ఇలా ప్రకటించాడు, 'దొంగ ఎత్తు సరిగా ఐదడుగుల నాలుగంగుళాలు. ఇక్కడ పొంచినపుడు, కిటికీకి వున్న ఆరీ అరని రంగులో వాడితలవెంట్రుక చిక్కింది.

అందరికీ ఆశా, ఆశ్చర్యం కలిగేయి. ఇంకేం కాపీ తీసాడో అని ఎదురుచూస్తున్నారు. ఆయనకీ మేడిగలోనే వుండేవాళ్ళెవరిమీదనో అనుమానం వున్నట్లు తేల్లమయింది.

మర్నాడు అందులో నివసించే ప్రతివాడి వేలిముద్రలూ తీసుకున్నాడు భూపే. దినమంతా ఓపిగా వాటితోనే కూర్చున్నాడు. తన నోట్ బుక్ లోని ముద్రలతో ప్రతీదీ పోల్చిచూచి చివరకు పెదవి విరిచాడు. ఇక లేచి పోలీస్ స్టేషన్ దారిపట్టాడు.

"కిటికీమీద దొరకిన వ్రేలి ముద్రలు దేనికీ సరిపోవటం లేదు. మేడిగల్లో వాళ్ళు కాదనుకుంటాను" అన్నాడు భూపే తన నోట్ పుస్తకం ఇన్‌స్పెక్టర్ గోఖే(పూర్తి పేరు గోకేటి ఖేతాళరావు)కి అందిస్తూ. మళ్ళీ అన్నాడు, "మీ స్టేషన్‌లో నేరస్థుల తాలూకు వ్రేలిముద్రల చిఠా ఉంటుంది కాదూ! దయచేసి రేపు మధ్యాహ్నంవరకు పోల్చి ఫలితం చెప్పాలి మిస్టర్ గోఖే."

"అసలు నీదాకా రానిస్తానుటోయ్! ఈ ముద్రలతో అయ్యేదేమిటి?" అనుకుంటూ, "సరే" అన్నాడు గోఖే వెక్కిరిస్తూన్నట్టు పైకెత్తిన కనుబొమలతో.

## తెన్నేటి అహల్యాదేవి

ఆ రాత్రి చివ్వరి గదిలో రహస్యంగా మకాం వేశాడు గో. ఖే పదకొండు గంటలదాకా బలవంతంగా మేల్కొన్నాడు. ఐనా ఒంటరిగా ఎంతసేపని? ఎప్పుడు నిద్ర పట్టిందో, పాపం మెలకువ వచ్చేసరికి తెల్లవారవస్తోంది. లేచి త్వరగా తలుపు తియ్యబోయాడు. ఆశ్చర్యం! బైట గొళ్ళెం వేసి వుంది అరచి గోలచేస్తే, తుద కెవరో లేచి వచ్చి తీశారు. యథోచితంగా, ప్రక్కగదిలోనే, వంకెను వ్రేలాడే చొక్కా జేబులో ఉండాల్సిన పర్సు లేదు. ఇంకో దొంగతనమా? తన నీడలోనే? "ఎంత మంచి ఛాన్సుపోయింది! చేజిక్కిన దొంగ జారిపోవడం ఎంత దురదృష్టం" అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్ గోఖే, నెత్తి గోక్కుంటూ.

* * *

ఆ మధ్యాహ్నం భూపే వేలిముద్రల పరీక్షా ఫలితాలకోసం స్టేషన్‌కు పోయాడు.



నాట్యగణతి

—ఫొటో: కమృద్దీన్ ఖాన్, కటక్.]

"హాలో మిస్టర్ గోఖే! ఏమైంది? ఎవరి ముద్రలో ఏమైనా ఆచూకీ తెలిసినట్టేనా?"

ఇన్‌స్పెక్టర్ తెల్లమొగం వేశాడు. పిల్లగించుకొని చెప్పాడు, "బలే వాడవయ్యా! తీరా చూస్తే నా వ్రేలిముద్రలే అవి. దొంగతనమైన మర్నాడు నువ్వొగకముందు నే నా కిటికీ అంతా పరీక్షిస్తుంటే పడివుంటై..." గత రాత్రి తను వేసిన కాపు సంగతి భూపేకింకా తెలియనందుకు ఇన్‌స్పెక్టర్ తన్ను తానభినందించుకున్నాడు.

వ్రేలిముద్రల కోసం పడ్డ వ్యథఅంతా, ఈ వింతకథ గామారి, వృథా ఐపోయింది. ఎన్నో పరిశోధక నవలలు చదివిన భూపే డిటెక్టివ్ హృదయానికి ఓ అనుమానం తట్టింది. 'అసలితడు నిజమైన ఇన్‌స్పెక్టరేనా? లేక దొంగవాడే ఇలా

గోథే ఏం చూస్తున్నాడా? వాడెవడా?" మళ్ళీ అనుకున్నాడు. "అబ్బే! ఇక్కడ అలాంటిదానికేమీ ఆస్కారం లేదు." తనకు కాదని నిర్ధారించుకున్నాడు. ఈ ఆలోచనలతో భూపేషు మతిపోయినట్లైంది.

అలాగే గోథే ఎగుదుగా దీర్ఘంగా ఆలోచిస్తూ కూచున్నాడు. హఠాత్తుగా ఒక చిటికేసి "అదీ సంగతి...సరే, ఈ దెబ్బతో దొంగ దొరికిపోవాల్సిందే. కాని ఇప్పుడేమీ చెప్పను...గుడ్ బై మిస్టర్ గోథే" అంటూ లేచిపోయాడు.

అంత హఠాత్తుగా అతనికి ఏం జ్ఞానోదయమైందో! తనకలాంటిదేమీ కానందుకెంతో నొచ్చుకున్నాడు గోథే. అతనికన్న ముందే తాను దొంగను పట్టుకోగలిగితే ఎంత బాగుండును? కాని తను దొంగను పట్టాలనిపోతే, తనకు నిద్రపట్టకుండా వుండాలిగదా!

ఆరోజునించే పట్టుదలతో మడిగల్లో పై అంతస్థుమీద పాపం నిద్రలేకుండానే కాపు వేశాడు, గోథే. ఒకటి, రెండు, మూడు రాత్రులు ఏ సంఘటనా లేకుండానే గడిచాయి. చాలా నిరుత్సాహం కలిగింది. దొంగతనాలు కాకుండా వుంటానికే తను ఉద్యోగంలో ఉంది. ఐనా అప్పుడు మాత్రం దొంగతనం కాదేమో అనేది ఆయన ఆదుర్దా. ఆ రాత్రికూడా వట్టిగానే గడిచిపోయింది, అతనికిక నిరాశ కలిగింది. ఐదో రాత్రి పన్నెండు దాటింది. మెట్లపక్కనే, పిట్టగోడ కానుకుని, బొంగులబస్తాల వెనుకగా ఎర్రని కళ్ళతో పొంచివున్న గోథే లేచి నలుదిక్కులా చూచాడు. అసంతృప్తిగా ఇలా అనుకున్నాడు, "లాభంలేదు దొంగ పసికట్టేశాడు. వాడిక వస్తాడని ఏమీ ఆశ లేదు. ఈ నిద్ర చెడటం కూడా......" హఠాత్తుగా అల్లంత దూరాన ఏదో కదలిక చూచినట్లనిపించిందతనికి. ఆ గాఢాంధకారంలో, ముందుకు వంగి కళ్ళుపొడుచుకుని పరికించాడు. అవును, నిస్సందేహంగా అది మనుష్యాకారమే! పిల్లిలా అడుగులు వేస్తూ ఇటే వస్తున్నాడు. ఈ సారైనా, మెలకువతో ఉన్నందుకు తన అదృష్టాన్ని అభినందించుకుంటూ గోథే కుదించుకు కూచున్నాడు. తాను చెయ్యబోయే సాహసకార్యాన్ని గూర్చి పరిపరివిధాల తలపోస్తున్నాడు. ఇంతలో జ్ఞాపకంవచ్చింది. తన రైఫిల్ గదిలో పెట్టివచ్చాడే! ఇప్పుడు లేచి తీసుకురావాలంటే అలికిడికాదూ? ఔను. అలికిడైతే వాడిక దొరకడం దుర్లభం. ఏమీ అక్కర్లేదు...... ఆ ఆకారం మేడమెట్లు సమీపించింది. అటూఇటూచూసి మేడ మెట్లెక్కడంకూడ స్పష్టంగా చూచాడు. గోథే. క్షణాలు లెక్కపెడుతున్నాడు. అతని గుండె వేగం హెచ్చింది.

మెట్లమీది అడుగుల చప్పుడు సమీపించింది, మెల్లగా—అతి మెల్లగా, దొంగ పై మెట్టుమీద కాలుపెట్టాడు. ఎంతో జాగ్రత్తతో అటూ ఇటూచూచి ఒక్క ఉదుటున ముందుకు వేశాడో లేదో - తటాలున గోథే అతడి మీదకు దూకి గొంతు పట్టుకున్నాడు. ఎలాగైనా వశపర్చుకొని సగర్వంగా పలువురి ఎదుటా ప్రదర్శించాలని. తగని పట్టుదలతో విజృంభించాడు గోథే. కాని వాడుమాత్రం ఏమీ తక్కువ తినలేదు. అనుకున్న దానికన్నా చాతుర్యంగా చలాగ్గా పెనగుతున్నాడు. కన్నంలో తేలుకుట్టిన దొంగలాగానే వాడూ కిక్కురుమనటం లేదు. ఇద్దరూ నిశ్శబ్దంగా ఆ నిశీథంలో మల్లయుద్ధం చేస్తున్నారు. పిట్టగోడమీద పడ్డవాడు క్రిందకు జారాడంటే కపాలమోక్షం తప్పదు. ఒకరినొకరు క్రిందకు తోసెయ్యాలని గుద్దులాడుకుంటున్నారు."

అప్పుడే, ఈ గుద్దుళ్ళకు, త్రోపిళ్ళకు ప్రక్కగదులవాళ్ళిద్దరు ముగ్గురు మేలుకొన్నట్లున్నారు. గోథే అలసిపోయాడు. దొంగతనను నెట్టివేసే పరిస్థితి వచ్చింది. ఒక చేత్తో వాడి నడుం పట్టుకొని, రెండో చేత్తో కిటికీ చువ్వ పట్టుకొని గట్టిగా అరిచాడు. అతని భల్లూకం పట్టు విడిపించుకోలేక ఏమో దొంగ ఇక కదల్లేదు. ఒక తలుపు తెరుచుకుంది. గవాక్షద్వారంగుండా విద్యుద్దీపం వెలుగు ప్రసరించింది. ఇద్దరు ముగ్గురు బైటికివస్తున్నారు కూడా.

వెలుతురులో గోథే సగర్వంగా దొంగ ముఖం కేసి చూశాడు. దొంగకాదు! తెల్లపోయినుంచున్న భూపే! ఇంతసేపూ ఈ యిద్దరేనా యుద్ధంచేసింది? చూస్తే. ఇద్దరూ ఇంజన్లలాగా రొప్పుతూ చెమటలు కక్కుతున్నారు. అందర్నీ చూసి తలవంచుకున్నారు. "మరి దొంగ ఎవరు?" అన్నట్టుగా ప్రేక్షకులంతా చూస్తూ ఉండిపోయారు.

* * * *

తెలవారేసరికి ఊరంతా గప్పున వార్త వ్యాపించింది. ఆరాత్రి సుమారు ఒంటిగంటకు, ప్రయివేట్ డిటెక్టివ్ భూపే ఇంట్లో దొంగలు పడ్డారు!! ★


